

# శారద

**జ్యోతి**

'శారదా'

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాను నా ఊహా ప్రపంచాన్నొదిలి — కాని ఏమీ మాట్లాడకుండా ముఖంలోకి చూస్తున్నాను. ఎర్రగా మత్తుగా ఉన్న కళ్లతో 'ఏమిటి ? నీకేమైంది? అలా గుడ్లప్పగించి చూస్తావ్? — ఇవాళ రమ భోజనానికొస్తుంది—కాస్త పిపిలైజ్డ్‌గా ప్రిపేర్ చెయ్యి— నీ తెలుగు తెలివితేటల్నొదిలిపెట్టి—' మరి సమాధానం కోసం కూడా చూడకుండా వెళ్లిపోయారు.

వారి కళ్లని చూస్తే మొదట్లో ఎందుకో చాలా భయంగా ఉండేది. నా ముఖంలో ఆ భయం ప్రస్ఫుటం గాకుండా ఉండాలని విశ్వప్రయత్నంచేసి కూడా కృతకృత్యురాల్ని కాలేకపోయేదాన్ని. ఏనాడూ ముఖంలోకి చూసి మాట్లాడటమనేదే జరిగేదికాదు — కాని అలా ఉండటానికి వీలయేదికాదు.

'ఏం ? ఎందుకలా తలవాల్చి మాట్లాడతావ్ — నీ మంచితనానికి మురిసిపోతాననా ? కాస్త తల పైకెత్తి ఇటువైపు చూసి మాట్లాడు-చదువు — నీ చదువు సంస్కారం ఏమైనాయి — నీ ప్రవర్తనని నిర్లక్ష్యం చేస్తున్నకొద్దీ నీలో అహం పెరిగిపోతోంది. నా కిటువంటి ప్రవర్తనంటే పరమ అసహ్యం.

ఏమాత్రం ఆప్యాయతలేని కటువైన మాటలు నా చెవుల్లోకి దూసుకుపోయేవి. విస్మయంగా కళ్లు పైకెత్తేదాన్నికాని ఆ చూపులు అలా ఒక్కక్షణంకూడా నిలిచేవికావు—వెంటనే అప్రయత్నంగా కళ్లు క్రిందికి వాలిపోయేవి.

దేన్నైతే మర్చిపోవాలని నా చేతినిండా పని కల్పించుకుంటున్నానో అది మర్చిపోవటం నాకు సాధ్యం కావటం లేదు. పిచ్చి పిచ్చిగా భూత భవిష్యద్వర్తమానపు సంఘటనలన్నీ నన్ను చుట్టు ముట్టుతూనే ఉన్నాయి.

ఎమ్. ఏ. తెలుగు ప్యాస్ అయ్యాక నా వివాహం చాలా ఘనంగానే చేశారు. ఒక్కర్తినే ఆడపిల్లనవటం కారణంగా నా మాటకి ఎదురే వుండేదికాదు. అందుకే చిన్నతనంలో వివాహంచేసి ముద్దుముచ్చట్లు కళ్లారా చూడాలని తాతయ్య, బామ్మ ఎంత అభిలషించినా మొండితనంగా నేను చదువుకుంటానని మారాం చేస్తే నామాట తీసివెయ్యలేకపోయారు. ఎమ్. ఏ. పూర్తి చెయ్యగానే నా వివాహం చెయ్యాలన్న పట్టుదల, తాపత్రయం పెరిగిపోయాయి. దాన్ని కాదనేశక్తి నాలోనూ లేదు. నేనేమీ పెళ్లి చేసుకోకుండా ఆ జన్మ బ్రహ్మచారిణిలా ఉండి పోవామనుకోలేదు. కాని అనుకున్నంత సులభం కాలేదు మా నాన్నగారికి నా వివాహం చెయ్యటం. కట్నం అడిగినంత యివ్వగలరు కాని, అందం ఎక్కడినించి తెస్తారు. ఏదో సాధారణంగా ఉండే నా రూపం మా నాన్నగారికి, తాత

య్యకి నచ్చిన వరునికి నచ్చేదికాదు. మా బామ్మ నా కాబోయేభర్త నవమన్మథుడై ఉండాలనుకునేది. మా బామ్మ కోర్కెలు చూస్తే నాకు నవ్వు వచ్చేది—తన మనుమరాలేమైనా 'రంభా' 'ఊర్వశా' చేసుకోబోయేవాడంత నవమన్మథుడు కావడానికి. మా అన్నయ్యకి అంద చందాలతో నిమిత్తం లేదు. నన్ను చేసుకోబోయేవాడు నన్నొక దేవతలా పూజించాలనేవాడు.'

'అలా కాకుండా నీ పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చూపించినా వాడి చర్మం వొలిచేస్తాను చెల్లాయ్' అంటే,

'అప్పుడు నీ ముద్దుల చెల్లాయ్ ఇంకా బాధపడదూ!— వాళ్ల ఆయన్ని కొట్టావని'—అని నవ్వుతూండేదాన్ని—

'తమాషాలు కాదు చెల్లాయ్—నే చెప్పే ప్రతి అక్షరం నిజం—అలా జరిగిందంటే వాడిరక్తం కళ్ల చూస్తాను'—

ఆ మాటల్లో ఉన్నపట్టుదల, కోపం చూస్తే భయంవేసేది. మా నాన్నగారి దృష్టిలో అతను ఓ డాక్టరేట్ తీసుకున్న వాడైనా అయుండాలి. ఈ కోర్కెలతో, అన్వేషణతో మరో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. అన్నయ్య స్నేహితుడు శేఖరం 'కొంచెం దూరం బంధువు. పేరు మధూ' అంటూ పరిచయం చేశాడు నాన్నగారికి ఈయన్ని. ఆయన అందరికీ నచ్చారు. నన్ను చేసుకోవడానికి ఏమీ అభ్యంతరమూ చెప్పలేదు—మా వివాహం జరిగిపోయింది.

మొదటిరోజు గదిలో అడుగుపెట్టినప్పుడు తెలిసింది ఆయనకి నేనంటే ఏమీ ఇష్టం లేదని—

'అంత ఇష్టం లేనివారు నన్నెందుకు చేసుకున్నారు?' అన్నాను పౌరుషంగా!

'అమ్మకీ, నాన్నగారికీ నచ్చావ్...బహుశా నీ డబ్బు నచ్చి ఉండచ్చు. వాళ్లకి నచ్చిన అమ్మాయి నాకు నచ్చదూ—నాకు నచ్చిన అమ్మాయి వాళ్లకి నచ్చదూ—ఏదో ఒక నాటికి ఎవళ్లమో ఒకళ్లం సర్దుకోక తప్పదు. పెద్దవాళ్ల మనసు కష్టపెట్టట మెందుకని బి సి. నాటి నీ కట్టూ బొట్టూ నచ్చకపోయినా 'సరే' నన్నాను. నాకు నువ్వంటే ఇష్టంలేదు, అంటే నిన్ను నా భార్యగా ఊహించుకోవడం నా కిష్టముండదు. అయినా పెళ్లి చేసుకున్నాను కనక నువ్వు నాతోపాటు నా యింట్లో ఉండటాన్ని మాత్రం ఎలాగో సహిస్తాను. దీన్ని సహించానుకదా అని భార్యననే భావంతో నామీద ఏమైనా అధికారం చూపించబోయినా, ప్రశ్నించ బోయినా నేనేమాత్రం సహించలేను – నేను ఎలా ప్రవర్తించినా సహించిఊరుకోగలిగితేఉండు. లేకపోతే— అంటె నీ కిష్టం లేకపోతే పుట్టింట్లోనే ఉండు' అంటూ అతి తేలికగా చెప్పి ఓ తలగడా నామీదకి విసిరి,

'ఇక నాకు నిద్రవస్తోంది. లైటార్పెయ్' అన్నారు. నాకు విపరీతమైనకోపం వచ్చింది.

'ఎందుకో ఇంతజాలి?—ఈతలగడా ఇవ్వడానికి—దీనికోసమే బెంగపెట్టుకుంటున్నా ననుకున్నారు కాబోలు...జీవితాలతో ఆటలాడు కోవటమంటే వీరికెందుకో అంత సరదా?—నేను ఈయనకి చేసిన అపకారమేమిటి? నాజీవితాన్నెందుకిలా నాశనంచేసి ఆనందిస్తారు?—రేపన్నయ్యతోచెప్తే ఇటో అటో తేల్చేస్తాడు—నేను తన కవసరం లేనప్పుడు నేనా ఇంటికెందుకు వెళ్లాలి? ఏమైనాసరే వెళ్లకూడదు'

అని నిశ్చయించుకుని ఆ నేలమీదే తలగడలో ముఖందాచుకు పడుకున్నాను. నాకళ్లనించి అప్రయత్నంగా జారిన కన్నీళ్లు తలగడను తడిపి ముద్దచేస్తున్నాయి. వాటిని అరికట్టాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. విధి నామీద పగపట్టి కక్షతీర్చుకుంటున్నట్లనిపించింది. నిద్రదరికి చేరాలని ఎంత ప్రయత్నించినా ఆయనలాగే అదీ నాకు దూరంగానే నిలిచిపోయింది. దాని చేరువకు చేరుకోవటం నాకు సాధ్యం కాలేదు. అమ్మపిలుపుతో తెల్లవారి లేచానే కాని అద్దంలో నాముఖం చూసుకున్న నాకు భయం వేసింది అలా కనిపించటానికి. ఇంట్లో ఎవరికైనా ఈవిషయం ఎలా చెప్పాలో కూడ నాకర్థంకాలేదు. అన్నయ్యని తలుచుకుంటేనే భయంవేసింది. సాధ్యమైనంత మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ తలుపు తెరిచి 'ఏమిటమ్మా! అప్పుడే లేపేశావ్? నా కెంత నిద్ర వస్తోందో తెలుసా?' అంటూ బద్ధకంగా అక్కడేఉన్న బామ్మ పక్కమీదికిపోయి పడుకున్నాను.

'పోనీలేవే రాజ్యం—పడుకొని. రాత్రంతా నిద్రలేదు కాబోలు' అన్న బామ్మమాటలు వినిపించాయి.

'నిద్ర లేకపోవటమైతే నిజమే—కాని బామ్మ అనుకుంటున్న కారణమా? అది మాత్రంకాదు...' అని నాలోనేనే అనుకున్నాను.

అలాగే పడుకుని ఆలోచిస్తున్న నేను అన్నయ్యకి చెప్పటాన్ని విరమించుకున్నాను, అన్నయ్య అనేమాటలు చెవుల్లో ప్రతిధ్వనించటం మొదలుపెట్టాయి. ఇక్కడే ఉండిపోవటం కారణంగా అమ్మా, నాన్నగారూ బామ్మా, తాతయ్యా... వీళ్లంతా బాధ పడతారు. అన్నయ్యకోపంతో రెచ్చిపోతాడు—అంతేతప్ప నేను పొందదలిగేదీ, సాధించేదీ ఏముంది? ఇక్కడున్నా, అక్కడున్నా నాకు ఒకటే—పోగా అక్కడేఉంటే అధమం వీళ్లైనా తృప్తిగా ఆనందంగా ఉంటారు' అని ఒక నిశ్చయానికివచ్చి లేచి మామూలుగా తిరగడానికి ప్రయత్నించాను. అన్నయ్య. 'ఏం చెల్లాయ్ అంత ముభావంగా ఉన్నావ్? ఇవాళ వెళ్లావంటే మళ్లీ ఎప్పుడొస్తావో?—కాస్త హుషారుగా ఉండు' అంటూ మొదలుపెట్టాడు. అందుకు సమాధానంగా ఒక్క చిరునవ్వుకంటే ఏమీ ఇవ్వలేకపోయాను.

మా అత్తగారూ మామగారూ మాతో పాటుండేవారుకారు. పల్లెలో ఉండేవారు. ఇక ఉండేది మే మిద్దరమూను — ఇక్కడికి వచ్చాక ఆయన ఇంకాబాగా అర్థమయారు. రాత్రి ఎప్పుడో అర్ధరాత్రివేళ ఇంటికి చేరుకునేవారు ... మత్తుగాతాగి ఎర్రటి కళ్లతో. మొదట్లో అర్థమయేది కాదు ఆయన ఎక్కణ్ణించి వస్తున్నారో. ఆటు తరువాత తెలిసింది నైట్‌క్లబ్‌నుంచి వస్తారని. ఆకళ్లుచూస్తే భయమేసేది—ఒక్కర్తినీ ఆయనతో ఆ పరిస్థితుల్లో ఉండాలని తలుచు కున్నప్పుడల్లా అక్కణ్ణించి పారిపోవాలనిపించేది. ఎప్పుడు ఇంటికి వచ్చినా ఎవరోఒక అమ్మాయిని వెంటబెట్టుకుని వచ్చేవారు. అంతా ఆధునికంగా తయారయామనుకున్న నాగరకులే—ఎత్తు మడమలజోళ్లు, లిప్‌స్టిక్, నైలాన్‌శారీ, స్లీవ్‌లెస్ బ్లౌజ్, లేదా గౌను, బాబ్డ్ హెయిర్—ఆ రకమైన ఆధునికతను వారు ఇష్టపడేది—పాశ్చాత్య నాగరకతాదాసులైన స్త్రీలు వారికొక్కావలసింది—మనకి ఒక నాగరకత లేదని ఇతరుల ననుకరించటం—దేశ

కాల పరిస్థితుల ననుసరించి వ్రస్తాలంకరణ ఉండాలేకాని ఇతరులనెందుకు కమకరించాలి?—వీరి ప్రవర్తనచూసి ఇంట్లో పనిమనుషులుండటాన్ని సహించలేక వాళ్ళని మాన్పించి ఆ పనంతా నేనే చేసేదాన్ని. ఆపనిలో ఏమాత్రం లోపంవచ్చినా మండిపడేవారు. ఆమాటల్లో కటుత్వం, ఆకళ్లల్లో ఎరుపు, ఆచూపుల్లో వాడి — చూస్తే భయం వేసేది. కాని రోజులు గడుస్తున్న కొద్దీ నాలో నిర్లక్ష్యం పెరిగిపోయింది. అవేవీ నాకు సంబంధించనట్లు ప్రవర్తించేదాన్ని.

ఇలాఉండగా ఒకనాడు పిడుగులాటి అన్నయ్య ఉత్తరం వచ్చింది. 'నిన్ను చూసి చాలారోజులయింది. ఎప్పుడు రమ్మన్నా ఏదో ఒక సాకు చెబుతూనే ఉన్నావ్ తాతయ్యా బామ్మా నీకోసం బెంగపెట్టుకున్నారు. అందుకని నేనొస్తున్నాను. నాతోపాటు నువ్వుకూడా రావాలి?' అంటూ...

'ఏం చెయ్యాలో తోచలేదు. అంతవరకూ ఎప్పుడూ ఆయనతో ఏ విషయాన్నిగురించీ మాట్లాడలేదు. నేను చెప్పింది ఎంతవరకు వింటారో కూడ నాకు నమ్మకంలేదు. అయినా ఒక నిశ్చయానికొచ్చి ఆ రోజు సాయంత్రం ఆయనతో.

'రేపు అన్నయ్యొస్తున్నాడు' అన్నాను.

'అయితే నన్నేం చెయ్యమంటావ్?'

# శారద

'నేను మీ యింటికొచ్చాక ఎప్పుడూ ఏదీ అడగలేదు. కాని ఇవాళ మిమ్మల్నొకటడుగుదా మనుకుంటున్నాను— మీరు అదొక్కటే చెయ్యండి ... నేను మిమ్మల్ని ఏదో అధికార పూర్వకంగా అడగటం లేదు...' అంటూ నేలమీద బొటనవ్రేలితో రాస్తూ నిల్చున్నాను.

'ఏవిటది ?'

'అన్నయ్యున్న రెండురోజులూ మీరు ఎవర్నీ ఇంటికి తీసుకురాకండి...'

'ఏం ? ఎందుకని ?—మీ అన్నయ్యని చూసి నే నెందుకు భయపడాలి ?'

చాలా కటువుగా, కోపంగా ఉన్నాయా మాటలు. నా నిట్టూర్పుని ప్రయత్న పూర్వకంగా త్రొక్కిపట్టి.

'అన్నయ్య చాలా కోపిష్టి. ఇదిచూస్తే ఎలా ప్రవర్తిస్తాడో కూడా చెప్పలేను ... తనని ఆపటం ఆ బ్రహ్మతరంకూడా కాదు. నాకు బాధకలిగించే విషయమేదైనా జరిగిందని తననుకుంటే ఏమాత్రం సహించలేడు.'

'అంత బాధకలిగించే ట్టయితే ఇక్కడెవరుండ మన్నారు ? మీ అన్నయ్యతో పాటు నువ్వూ వెళ్ళూ...'

'అలాగే అనుకుంటె మీతోపాటు అసలు వచ్చుండేదాన్నే కాదు. మీరు మీ తలిదండ్రులకోసం నామెడలో తాళి ఎలాకట్టారో అలాగే నా వాళ్ళకోసం మీదగ్గర ఉన్నాను ...మీరు అన్నయ్య వచ్చాక వాళ్ళని తీసుకువస్తే ఇక్కడనేనుండటం ఎలాగా జరగదు...' అని కొంచెం సేపాగాను. నాలోనూ నిర్లక్ష్యం పెరిగింది. మాటల్లో ఆ భావం వ్యక్తం చెయ్యకుండా ఉండలేకపోయాను.

'అయినా అన్నయ్య వచ్చినంతమాత్రాన నా కొచ్చే నష్టమేమీ లేదు. ఉండే నష్టమంతా మీకే...'

'అంటే'

'బావుంది...దానికి నేనేం సమాధానం చెప్తాను. మీరే ఆలోచించుకోండి' అని నిర్లక్ష్యంగా వెనక్కి తిరిగాను.

'శారదా ? ... ఏవిటా తొందర ... వాళ్ళని రావద్దన్నా మానరు. నన్నేం చెయ్యమంటావ్...ఏదో ఒకటి చెప్పు— ప్లీజ్—త్వరగా.'

మాటల్లో ఆతృత, స్వార్థం. అసహ్యం వేసింది 'ఆయనేమయితే నా కెందుకు? వార్ని చూసి నే నెందుకు జాలి పడాలి ?' అని ఒక్క క్షణం అనుకున్నాను. కాని దాన్నణుచుకుని.

'నే చెప్పినట్టు చేస్తారా' అన్నాను.

'ఆఁ! తప్పకుండా చేస్తాను...చెప్పు'


'మీకు అర్జంటుగా ఊరు వెళ్ళవలసిన పనుందని చెప్పి వెళ్ళిపోండి. ఒక వారం రోజులు పోయిన తరువాత రండి. అప్పటికి ఏదో ఒకటి చెప్పి అన్నయ్యని పంపేస్తాను.'

ఏ మనుకున్నారో 'సరే' నని వెళ్ళిపోయారు.

మర్నాడు సాయంత్రం ఆయన ఫోన్ చేసి అర్జంటుగా ఊరు వెళ్ళవలసిన పనుందనీ, ఇంటికి రాగానే వెళ్ళిపోవాలి కనుక బట్టలన్నీ సర్ది ఉంచమనీ చెప్పారు. అన్నయ్యకు క్షమాపణలు చెప్పుకుని వెళ్ళిపోయారు.

'ఆయన లేకుండా ఎలా వస్తాను చెప్పు? ఎప్పటి కొస్తారో కూడా సరిగా తెలియదు. మళ్ళీ సారికి తప్పకుండా వస్తాను కదూ!' అంటూ అన్నయ్యకు ఎలాగో సర్ది చెప్పి పంపేశాను.

'శారదా! మాకు భోజనం పెట్టెయ్.'



నా ఆలోచనలకి అంతరాయం కలిగింది. పనంతా ముగించుకుని పోయి పడుకున్నా ఏవో ఆలోచనలు చుట్టు ముడుతూనే ఉన్నాయి. ఆ ఆలోచనల్ల మధ్య ఎప్పుడు నిద్ర పట్టిందో కూడా తెలియదు.

మర్నాడు సెలవు పెట్టి ఇంట్లోనే ఉన్నారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నేను ఇక్కడి కొచ్చి దాదాపు సంవత్సరం కావస్తోంది. కాని ఎప్పుడూ ఆయన ఇలా ఇంట్లో లేరు. రాత్రి భోజనం కూడా త్వరగా పూర్తి చేశారు. నేను పని పూర్తి చేసుకుని నా గదిలో కొచ్చి కళాపూర్ణోదయం చదువుకుంటున్నాను.

'శారదా.'

నా గదిలోకి ఆయనెప్పుడూ రాలేదు. 'ఎప్పుడూ ఒంటరిగా ఇంట్లో ఉండటం అలవాటులేదు. తోచలేదు కాబోలు' అనుకుంటూ 'ఎందు కిలా వచ్చారు ?' అన్నట్టు ప్రశ్నార్థకముఖంతో లేచి నిల్చున్నాను. 'ఏమిటి ? కూర్చోమన్నైనా అనవ్‌...నువ్వు పడుకునే దెక్కడ ?' వ్రేలితో అక్కడే ఉన్న చాప చూపించాను.

'అక్కడెలా పడుకోగలవ్ ?'

'తలగడను ఆధారంగా చేసుకుని కటికి నేలమీదే పడుకోగలిగినదాన్ని చాపమీద పడుకోటానికేం' అనుకుని చిన్నగా నవ్వి.

'నా కలవాటే' అన్నాను.

# శారద

'నాకేమీ తోచటంలేదు'

నేను మౌనంగానే ఉన్నాను.

'నువ్వు చాలా అనాగరకంగా ఉంటావ్, నువ్వూ రమా వాళ్ళలా ఆధునికంగా ఉంటే చాలా బావుంటావ్...అయినా...ఇవాళ ఈ చీరలోనే ఎందుకో...అందంగా కన్పిస్తున్నావ్...'

ఈ సంభాషణ, మాటలతీరు అసహ్యాన్ని కలిగిస్తున్నాయి—కాని భర్త— సహిస్తూ మౌనంగా ఊరుకున్నాను,

'శారదా ! నేను నీ భర్తని...నిన్ను పొందే అధికారం నాకు లేదంటావా ?'.

కళ్ళలో మత్తు—

'ఛీ ! మనిషేనా—ఇంత సిగ్గులేదేం ?'

ఎంత అసహ్యించుకో కూడదనుకున్నా నాలో జుగుప్స, అసహ్యం పెరిగిపోతున్నాయి...దగ్గరగా వచ్చి నా చెయ్యి పుచ్చుకున్నారు. నాలో అపరిమితమైన ఆవేశం కలిగింది. ఒక్కసారి చెయ్యి విదిలించుకుని పక్కకి జరిగాను. ఆయన అహం దెబ్బతింది. ముఖం కోపంతో జేవురించింది.

'నేను నీ భర్తని—నీ యిష్టానిష్టాలతో నాకు సంబంధంలేదు. నీమీద నాకు సంపూర్ణాధికారం ఉంది.'—ఆవేశంగా ఉన్నాయి మాటలు.

'అవును మీలో మానవత్వ మనేది ఏమైనా ఉంటేగా ?—పశుబలం చూపించగలరు...అదేగా మీరు చెప్పేది...'

'ఏమిటి నువ్వనేది ? నేను పశువునా ? ఛీ—చదువుకున్నావేకాని సివిలిజేషన్ చిన్నమెత్తు లేని దానివి ... భర్తపట్ల గౌరవం పిసమెత్తు కూడాలేదు—అనాగరికత ప్రబలి పోయింది—'

నాలోనూ విచక్షణా జ్ఞానం నశించి పోయింది.

'అవును—ఆప్యాయత, ప్రేమలేని కామం పశుత్వం అనిపించుకోక మానవత్వం అనిపించుకుంటుందా— భార్యగా నన్ను మీరే మాత్రం అభిమానించ గలుగుతున్నారు ? మిమ్మల్ని నేను గౌరవించటానికి...పైగా నాగరకత సివిలిజేషన్—ఈ పదాలు ఉచ్చరించే అర్హతకూడా మీకు లేదు.

'నాగరకత'—అంటే ఏమిటి ?—మీకూ అనాగరక జాతికీ భేదమేమిటి ? ఆదిమ నివాసులకు వివాహబంధం లేదు. వాళ్ళు స్వేచ్ఛా విహారులు— నాగరకత పెరిగిన కొద్దీ వివాహమని కొన్ని కట్టుబాట్లు ఏర్పడ్డాయి. మీరూ వారిలాగే స్వేచ్ఛా విహారులు—ఇక వేషధారణంటారా మానవుడు ప్రప్రథమంలో దుస్తులను ధరించటం అవసరమనుకోలేదు. సివిలిజేషన్ పెరుగుతున్న కొద్దీ దుస్తులను ధరించటం అలవరచుకున్నాడు మానవుడు. నిండుగా చీర ధరించటం నాగరకత అవుతుంది కాని... మరే వేషధారణా నాగరకత అనిపించుకోదు. నాగరకత పురోగమిస్తున్న రోజుల్లో తిరోగమిస్తున్న మీరు నాగరికులెలా అవుతారు... మీలో ఇంకా కాస్తో కూస్తో మానవత్వం మిగిలి ఉందనుకున్నాను. ఇప్పుడు అది కూడా లేదని ఋజువు పరుచుకున్నారు... ఛీ!—ఈరోజు మిమ్మల్ని చూస్తోంటే నాకసహ్యం వేస్తోంది...'

అప్పటికి కాని నా వాగ్ధోరణి కట్టుబడలేదు. అప్పుడర్థమైంది ఏం మాట్లాడానో— నాలో ఆవేశం నెమ్మదిగా చల్లారింది. ఆయన ముఖంలోకి చూశాను. మాటలేకుండా ఎన్నో భావాలు మిశ్రితమైన ముఖం—అది కోపమో, మార్పో... మరేమిటో... ●

